క్లుప్తంగా...

నేడు గొర్రెల పంపిణీ

మేడ్చల్: గొల్ల కురుమలకు బుధవారం మంత్రి మల్లారెడ్డి గొర్రెలను పంపిణీ చేస్తారని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, మండల పశువైద్యాధికారి డాక్టర్.విశాల్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో మంత్రి గొర్రెలను పంపిణీ చేస్తారని తెలిపారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు



సదస్సులో సర్పంచ్ మహేందర్‌రెడ్డి

కీసర: గుండెపోటు వచ్చినప్పుడు చేయాల్సిన ప్రథమ చికిత్స సీపీఆర్‌పై అవగాహన సదస్సును గోధుమకుంట గ్రామంలో సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గుండెనొప్పితో బాధపడే వ్యక్తికి తక్షణమే సీపీఆర్ నిర్వహించి ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోమని ఆంజనేయులు, ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి బి.సురేష్‌రెడ్డి, వార్డు సభ్యులు బాలరాజుగౌడ్, చీర శేఖర్, రజితశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్ క్యాంపులో అనురాగ్ ఎన్‌సీసీ కేడెట్స్



కేడెట్స్‌ను అభినందిస్తున్న అనురాగ్ పల్లా, మల్లేశ్

ఘట్‌కేసర్: ఎయిర్‌ఫోర్స్ అటాచ్‌మెంట్ క్యాంపులో వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు. కేడెట్స్ చందు, నివాస్, సందీప్‌యాదవ్‌ను యూనివర్సిటీ స్ట్రాటజీ అండ్ డిజిటల్ లెర్నింగ్ డైరెక్టర్ అనురాగ్ పల్లా, సీటీఓ మల్లేశ్ మంగళవారం అభినందించి ప్రశంస పత్రం అందజేశారు. ఏఎఫ్ఎస్ హకీంపేట్, బేగంపేట్‌లో విట్నెస్, ఎయిర్‌క్రాఫ్ట్‌లను క్యాడెట్లు సందర్శించారు.

బొడ్రాయి ప్రతిష్ఠకు ఏర్పాట్లు

పోచారం: నారపల్లిలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో జరగనున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠ వేడుకలకు నిర్వాహక కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. 21న బొడ్రాయి పండగ, 22న నాభిశిల ప్రతిష్ఠ, 23న బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ రమాదేవి, లింగంయాదవ్

ఘట్‌కేసర్: చౌదరిగూడలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు మల్లారెడ్డి ట్రస్ట్ అండగా నిలిచింది. గ్రామానికి చెందిన జయకర్, పాల్, సుగుణమ్మ, క్రిస్టోఫర్ కుటుంబ సభ్యులను మంగళవారం సర్పంచ్ రమాదేవి, బీఆర్ఎస్ స్థానిక శాఖ అధ్యక్షుడు లింగంయాదవ్, మండల ఉపాధ్యక్షుడు సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు మంగ పరామర్శించారు. ట్రస్ట్ తరఫున బాధిత కుటుంబాలకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.20 వేలు అందజేశారు. మాజీ సర్పంచ్ రాములుగౌడ్, వార్డు సభ్యులు స్వామిదాస్, ట్రస్ట్ ప్రతినిధి వేణు, రాముగౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులకు రూ.2 లక్షలను అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

శామీర్‌పేట్: ఆలయాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి అన్నారు. కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రమైన మూడుచింతలపల్లిలోని ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధి కోసం మంగళవారం మహేందర్‌రెడ్డి రూ.2 లక్షలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాంరవి, ఎంపీటీసీ నాగరాజు, నాయకులు మురళీగౌడ్, మంద స్వామిముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తుమ్మ చెరువు జలం..గరళం

దుర్వాసనతో కాలనీవాసులు సతమతం

- దోమల స్వైర విహారంతో అవస్థలు
- అటువైపు వెళ్లాలంటేనే ఆందోళన
- ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు
- పట్టించుకోని అధికారులు, నేతలు

మేడ్చల్: పట్టణంలోని తుమ్మ చెరువులో వ్యర్థాలు, చెత్తను ఇష్టానుసారంగా పడేస్తుండటంతో తుమ్మ చెరువు కంపుకొడుతోంది. ఆర్టీసీ కాలనీ, వినాయక్ నగర్ కాలనీ పైభాగంలో సూర్యనగర్, మల్లికార్జుననగర్, తదితర కాలనీల కింద ఉన్న తుమ్మ చెరువు పట్టణ ప్రజలకు భూగర్భ జలాలు పుష్కలంగా అందించేందుకు ఈ చెరువు కీలక భూమిక పోషిస్తోంది. కాలనీల మధ్య ఉండటంతో అధికారులు, పాలకులు ఎన్ని ఆదేశాలు జారీ చేస్తున్నా.. ఎన్ని సార్లు శుభ్రం చేస్తున్నా కాలనీలవాసులు తమ ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్తను తీసుకువచ్చి చెరువులో పడేస్తుండటంతో చెరువు కంపు కొడుతోంది.

కంపు, దోమల స్వైరవిహారం..

చెరువు పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయి చెరువులోని నీరు పూర్తిగా కలుషితం అవుతోంది. వ్యర్థాలు చెరువులోని నీటిలో చేరి దుర్గంధం వెదజల్లుతోంది. సాయంత్రం అయ్యిందంటే చాలు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో కాలనీలో చెరువు సమీపంలో నివాసం ఉండే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీప కాలనీల్లో దోమల బెడద తీవ్రమైంది. ఒక వైపు నుంచి చెత్తా చెదారం వేయడం, మరోవైపు నుంచి మురుగు నీటిని చెరువులోకి వదలడంతో నీరు పూర్తిగా కలుషితం అవుతోంది. ఆ ప్రాంతానికి వెళ్తే కంపు కొడుతోంది.

కఠినంగా వ్యవహరించాలి

కట్టపై, చెరువులో చెత్త వేయవద్దని, వ్యర్థాలు వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. బాధ్యత లేకుండా చెత్తా చెదారాన్ని చెరువులో పడేస్తున్న వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు. దాంతోపాటు చెరువులో మురుగు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అటు వైపు వెళ్లలేకపోతున్నాం



కంపు కొడుతుండటంతో చెరువు వైపు వెళ్లలేకపోతున్నాం. కట్టపై ఉన్న గుడికి పూజలు చేసేందుకు వెళ్లాలంటే మాస్కులు వేసుకుని పోవాల్సి వస్తోంది. దుర్వాసనతో పాటు కాలనీ దోమల బెడద ఎక్కువైంది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్, మంత్రి మల్లారెడ్డికి ఫిర్యాదులు అందజేశాం. మున్సిపల్ మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. – ప్రమోద్, ఆర్టీసీ కాలనీ

అధికారులు చర్యలు తీసుకోవాలి



తుమ్మ చెరువు కలుషితం కాకుండా మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. చెరువులోకి మురుగు నీరు రాకుండా మురుగు కాల్వలు, డ్రైనేజీని ఏర్పాటు చేయాలి. మున్సిపల్ తరఫున కట్టపై ప్రత్యేకంగా జవాన్‌ను ఏర్పాటు చేసి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి. చెత్త వేసే వారిపై జరిమానాలు విధించి కఠినంగా వ్యవహరించాలి. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి. – జాకట ప్రేందాస్

బాసర ఐఐఐటీలో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు సీట్లు



శ్రీకాంత్ నవ్య సౌమ్య

మేడ్చల్: పదవ తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.శ్రీకాంత్ బాసర ఐఐఐటీలో సీటు సాధించాడు. పదో తరగతిలో 9.7 జీపీఏ సాధించడంతో ఆయన బాసర ఐఐఐటీలో సీటు పొందాడు. శ్రీకాంత్‌ను పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ శ్రీధర్, ఏంఈఓ వసంత కుమారి అభినందించారు.

ఎదులాబాద్ జెడ్పీ విద్యార్థినులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు బాసర ఐఐఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతిలో 9.8 పాయింట్లు సాధించిన నవ్య, 9.7 పాయింట్లు సాధించిన సౌమ్య ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు ఎంపిక కావడం విశేషం. హెచ్‌ఎం సరస్వతి, ఉపాధ్యాయులు, స్థానికులు మంగళవారం వారిని అభినందించారు.

స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి



మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఏబీవీపీ ధర్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు విద్యార్థుల స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆత్మకూరు శ్రీనాథ్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌పై ఆధారపడి చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా పలు కాలేజీలు, మేనేజ్‌మెంట్లు వేధిస్తున్నాయని ఆరోపించారు. మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో విద్యారంగా సమస్యలు పరిష్కరించి పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ధర్నాలో విద్యార్థులు డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, అనుమతులు లేకుండా అక్రమంగా నడిపిస్తూ.. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా నాయకులు అఖిల్ సింగ్, మనోహర్, భాను, ఉమేష్ అవినాష్, ఆకాష్, గోపాల్ రాఘవేంద్ర, గణేష్, అజీజ్, మోక్ష సంజయ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరేణుకా ఎల్లమ్మ కల్యాణంలో మంత్రి మల్లారెడ్డి



ప్రత్యేక పూజలో మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: టెలిఫోన్ కాలనీలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం 6వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన అమ్మవారి కల్యాణంలో మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. శ్రీరేణుకా ఎల్లమ్మ భక్తుల కోరికలు తీర్చే అమ్మవారిగా పూజలందుకుంటున్నారు. అశోక్‌చే ఒగ్గు కథ నిర్వహించారు. అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, పార్టీ నేతలు కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మ, బింగి జంగయ్యయాదవ్, సుమన్ నాయక్, నేతలు పులకండ్ల జంగారెడ్డి, గుర్రాల వెంకటేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు ప్రహరీ పనులకు శంకుస్థాపన



పార్కు ప్రహరీ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలోని 7వ వార్డులో పార్కు ప్రహరీ పనులకు చైర్మన్ కె.చంద్రారెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.14 లక్షల ఎల్‌ఆర్‌ఎస్ నిధులతో పనులు చేపట్టామని చెప్పారు. స్థానిక కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మురళి, నారాయణ, మున్నేశ్వరరావు, లక్ష్మణ్, రమణ, రామారావు, నాని, సలీం, శ్రీనివాస్, శిరీష, భారతి, హంస, పద్మ పాల్గొన్నారు.

మూసివేసిన యూటర్న్ తెరవాలని వినతి



ట్రాఫిక్ సీఐకి వినతి పత్రం అందజేస్తున్న దీపిక, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి

మేడ్చల్: పట్టణంలోని జాతీయ రహదారిపై క్లాసిక్ ధాబా వద్ద ట్రాఫిక్ పోలీసులు మూసివేసిన యూటర్న్‌ను తిరిగి ప్రారంభించాలని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ నర్సింహరెడ్డికి మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి కోరారు.

ఈ మేరకు వారు కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, ఉమా నాగరాజు, మాధవి నరేందర్‌తో కలిసి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐకి వినతి పత్రం అందజేశారు. యూటర్న్ మూసివేయడం వల్ల ఎన్‌జీవోస్ కాలనీ ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి జాతీయ రహదారిపై మేడ్చల్‌కు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యూటర్న్‌ను తిరిగి ప్రారంభించాలని వారు కోరారు.

పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడొద్దని..



ఘట్‌కేసర్‌లో ఆర్టీసీ బస్‌పాసులను అందజేస్తున్న కౌన్సిలర్ మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్

ఘట్‌కేసర్: జెడ్పీ బాలికల పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థినులకు జన చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ బస్‌పాస్‌లను అందజేశారు. ఒక్కో బస్‌పాస్ దరఖాస్తు, లామినేషన్‌కు అయ్యే రూ.50లు పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడొద్దని ఆర్టీసీకి చెల్లించినట్లు సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. కౌన్సిలర్ మల్లేశ్, జన చైతన్య సేవా సమితి సభ్యులు అనిల్, ఖయ్యూమ్, రామకృష్ణ, సహదేవ్‌ముదిరాజ్, వీరేందర్‌యాదవ్, రాజు, సుధాకర్, జగదీశ్, మధు, ప్రవీణ్, సేవా సమితి ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎం అనిత, ఆర్టీసీ ప్రతినిధి రాంచందర్ పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి



జవహర్‌నగర్‌లో మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీఐ సీతారాం, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు



కార్మికనగర్‌లో కురుమ యువచైతన్య సమితి ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి

జవహర్‌నగర్ సీఐ సీతారాం

జవహర్‌నగర్: మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఉందని జవహర్‌నగర్ సీఐ సీతారాం అన్నారు. జవహర్‌నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌లో మంగళవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి, స్వామి వివేకానంద వర్ధంతి, అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు సీఐ సీతారాం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ అనిల్, కార్పొరేటర్ మేక లలిత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, బీజేపీ అధ్యక్షుడు రంగుల శంకర్, బీఎస్పీ అధ్యక్షుడు యాకస్వామి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, నేతలు తూటి శ్రీనివాస్, జంగిడి శ్రీనివాస్, రాజు, పెంటాచారి, శ్రీనివాస్, స్థానిక నాయకులు ఆనంద్, సతీష్, ఉపేందర్, యాదయ్య, వెంకటేష్, నరసన్న, శ్రీనాథ్‌గుప్తా, చారి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కురుమ యువచైతన్య సమితి ఆధ్వర్యంలో..

తెలంగాణ రాష్ట్ర కురుమ యువచైతన్య సమితి కార్యదర్శి మంగ యాకయ్య ఆధ్వర్యంలో మంగళవారం జవహర్‌నగర్ కార్మికనగర్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమితి జిల్లా నాయకులు జంగిడి శ్రీనివాస్, బూడిద నరేందర్, వెంకటేష్, సునీల్, కోటి, శ్రీను, భాస్కర్, మహేందర్, విశ్వకర్మ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మారోజు సోమాచారి, కురుమ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడికి ఘనంగా నివాళులు

మేడ్చల్: స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా నేతలు ఆయనకు నివాళులర్పించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో వివేకానంద విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. మండలంలోని మునీరాబాద్ గ్రామంలో సర్పంచ్ గణేష్, బీఆర్ఎస్ నేతలు వివేకానందుడికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు మల్లికార్జున్, హేమంత్‌రెడ్డి, పెంటయ్య, కమిషనర్ రాములు, డిప్యూటీ ఈఈ దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి

తెలంగాణ విముక్తి కోసం పోరాటం చేసి తొలిఅమరుడైన దొడ్డి కొమురయ్య వర్ధంతిని మేడ్చల్‌లో కురుమ సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, గొర్రె మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొమురయ్య చిత్రపటం నివాళులర్పించారు. కౌన్సిలర్లు కౌడె మహేష్, స్వామియాదవ్, హరిక్రిష్ణయాదవ్, దేవరాజు, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్ యాదవ్, గొర్రె మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి కొమురయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, కురుమ సంఘం, బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, శంకర్, బాలమల్లేష్, నరేందర్ పాల్గొన్నారు.



మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న నేతలు



మైసమ్మగూడలో వివేకానందుడికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మీరెడ్డి

గ్రామంలో వేగంగా అభివృద్ధి పనులు

శామీర్‌పేట్: జగ్గంగూడ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా మంగళవారం గ్రామంలోని సంపన్ బోల్ శ్మశాన వాటికలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వీధి దీపాలను అమర్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సంపన్‌బోల్‌లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తూ..

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు



వెంకటాపురం డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని కమలాలయ కాలనీలో నూతనంగా నిర్మించతలపెట్టిన బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సబితకిషోర్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలనీలో ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు వినోద్‌కుమార్, డీవీఎస్ శర్మ, నాయకులు భాస్కర్, అనిల్‌కిషోర్‌గౌడ్, శ్యాంసుందర్, మల్లెల శివ, లక్ష్మణ్ ముదిరాజ్, సయ్యద్ మోసీన్, మల్లేష్, స్వప్న, అమృత, ఈఈ రాజు, డీఈ, ఏఈ పాల్గొన్నారు.

ఏఆర్‌కే హోమ్స్ సమస్యల పరిష్కారానికి కృషి

మచ్చబొల్లారం డివిజన్‌లోని ఏఆర్‌కే హోమ్స్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్‌తో కలిసి ఏఆర్‌కే హోమ్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ వ్యవస్థ, గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు ప్రపోజల్‌లో ఉన్నాయని, సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, పరమేష్, శ్రీనివాస్‌గౌడ్, పుట్నాల కృష్ణ, శోబన్, దేవేందర్, డీఈ మహేష్, శానిటరీ సూపర్‌వైజర్ ప్రభాకర్, ఏఈ స్వాతి, కాలనీవాసులు పాల్గొన్నారు.